అట్రాసిటీ కేసు ఎత్తివేయకుంటే

ఆత్మహత్యే శరణ్యం

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

- ఎమ్మెల్యే అడ్లూరి ఇంటి ఎదుట చచ్చిపోతాం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి
- సల్వాజీ మాధవరావు కుటుంబ సభ్యులు
- ధర్మారంలో ప్రెస్‌మీట్

ధర్మారం, ఏప్రిల్ 13: తమ కొడుకు సల్వాజీ మాధరావుపై కాంగ్రెస్ నాయకులు పెట్టిన అట్రాసిటీ కేసును ఎత్తివేయకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇంటి ఎదుటే చచ్చిపోతామని మాధవ రావు కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. రెండ్రోజుల కింద ధర్మారం మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి మాధరావును అట్రాసిటీ కేసులో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో శనివారం మాధవరావు తల్లిదండ్రులు సల్వాజీ మారుతి రావు, రాజవ్వ, అతని సోదరి మాధవి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మాధవరావు అధికార పార్టీని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు కక్షగట్టి గత నెలలో తీవ్రంగా దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పుడు లేని విషయాన్ని సృష్టించి, కాంగ్రెస్ యూత్ నాయకుడిని ఎస్సీ కులం పేరిట దూషించాడని అక్రమంగా కేసు నమోదు చేయించి అరెస్ట్ చేయించారని, ఇది ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్‌పనేనని ఆరోపించారు. తాము వృద్ధులమని, కోడలు గర్భవతి అని, ఇలా అక్రమంగా కేసు పెట్టించి అరెస్టు చేయించి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. పదవిలో ఉన్నానని లక్ష్మణ్ కుమార్ ఇలా వ్యవహరించడం సరికాదని, గతంలో ఓ సారి తమ కొడుకును బెదిరిస్తూ ఫోన్‌లో మాట్లాడిన ఆడియో క్లిప్పింగులు తమ వద్ద ఉన్నాయని, తమ కొడుకు ప్రాణహాని ఉందన్నారు. పేదోడు ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెడతారా..? అంటూ ప్రశ్నించారు. తమ కొడుకుపై అక్రమంగా పెట్టిన కేసును ఎత్తివేసి జైలు నుంచి విడుదల చేయించాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

రాజకీయ కక్షతోనే మాధవరావుపై కేసు : కొప్పుల

ధర్మారం,ఏప్రిల్13: కాంగ్రెస్ సర్కారు రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సల్వాజి మాధవ రావుపై ఎసీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయించిందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ధర్మారంలో మాధవరావు తల్లిదండ్రులను ఈశ్వర్ పరామర్శించారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై ఏనాడు కక్ష సాధించలేదన్నారు. మాధవ రావుపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దీనిపై రామగుండం సీపీని కలిసినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు పూస్కూరు రామారావు, కూరపాటి శ్రీనివాస్, దేవి వంశీక్రిష్ణ, ఆవుల లత, మోకెనపల్లి రాజమ్మ, దేవి రాజేందర్,దేవి రేణుక,చిదుగు సంపత్, గంధం తిరుపతి తదితరులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

గోదావరిఖని : 12వ డివిజన్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం చేస్తాం
- మహిళలకు గృహలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక , బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం రామగుండం కార్పొరేషన్ 9వ డివిజన్ జనగామ, 12వ డివిజన్ విఠల్‌నగర్‌లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనగామలోని ఐకేపీ సెంటర్ వద్ద రైతులను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ మహిళలకు ఇచ్చిన గృహలక్ష్మీ పథకంను వెంటనే అమలు చేసి వారి అకౌంట్‌లో రూ.2500లు జమ చేయాలని అన్నారు. లేదంటే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను మహిళలు నిలదీస్తారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుండా ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు.

అంతర్గాం, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనిఆరం సాయంత్రం రాయదండి గ్రామంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను అమలు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తునే ఉంటామన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన హామిలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసే కార్యకర్తలకు, నాయకులకు బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఇక్కడ జడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ సర్పంచ్ ధర్మాజీ కృష్ణ, నాయకులు కొలిపాక మధూకర్‌రెడ్డి, నూకరాజు, కోల సంతోశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

సీఎం పదవిని త్యాగం చేసిన మహనీయుడు మండల్

మంథని : నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 13: బీసీలకు రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడు బీపీ మండల్ అని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. రిజర్వేషన్ల కోసం బీపీ మండల్ తీర్మానం చేస్తే అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ బెదిరింపులకు గురిచేశారని, తన నిర్ణయాన్ని మార్చుకోకుండా ముఖ్యమంత్రి పదవిని సైతం వదులుకున్న గొప్ప మహనీయుడు బీపీ మండల్ అని కొనియాడారు. బీసీల ఆరా ధ్య దైవం, బిహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా శని వారం మంథనిలో మండల్ విగ్రహానికి పుట్ట మధూకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. బీసీల హక్కుల కోసం మండల్ పోరాటం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం బీసీ వర్గాలను వాడు కొని వారి హక్కులను రాస్తున్నదని ఆరోపిం చా . అట్టడుగు వర్గాల కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో తాము ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్ గౌడ్, ఆరెపల్లి కుమార్, అత్తె చంద్రమౌళి, కాయితి సమ్మయ్య, గర్రెపల్లి సత్యనారాయణ, గొబ్బూరి వంశీ, పెగడ శ్రీనివాస్, కనవేన శ్రీనివాస్, గూడెపు మహేందర్, జంజర్ల శేఖర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు నివాళి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 13: గొర్రెల గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ వర్ధంతి నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహ వద్ద బీపీ మండల్ చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఇక్కడ గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఇక్కడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడురి శ్రీమాన్నారాయణ, వేల్పుల నాగరాజు యాదవ్, మేకల నర్సయ్య యాదవ్, సాగర్, రాజేశ్, లక్ష్మణ్, లచ్చయ్య, సతీశ్, కొమురయ్య, అంజి పాల్గొన్నారు.

ఆర్జీ-1లో క్వార్టర్ల కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని,ఏ ప్రిల్ 13: సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని శివాజీనగర్, హనుమాన్ నగర్, గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న సింగరేణి ఉద్యోగులకు స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో క్వార్టర్ల అలాట్‌మెంట్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు వెడల్పు కింద పోతున్న పలు క్వార్టర్లకు స్పెషల్ క్వార్టర్ కౌన్సెలింగ్ ద్వారా వారికి నచ్చిన క్వార్టర్లను కేటాయించారు. కౌన్సెలింగ్‌లో సెక్టార్-1 క్వార్టర్ల నివాసులకు కేటాయించారు. కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం రామ్మోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ పర్లపల్లి రామస్వామి, పీవో హనుమంత రావు, దేవాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు ఉండొద్దు

పెద్ద కాలువలో పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

కోల్‌సిటీ, ఏప్రిల్ 13: రామగుండం నగర పాలక సంస్థను సమస్య రహితంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య పర్యవేక్షకులు ప్రధాన పాత్ర పోషించాలని కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. ఈమేరకు కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం శానిటేషన్ సూపర్ వైజర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. అంతకుముందు నగరంలోని మల్లికార్జున్ నగర్‌లో ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు, కోదండ రామాలయంలో మట్టి చదును పనులను పరిశీలించారు. ప్లాస్టిక్ నిషేధం అమలు, కుక్కల బెడద, నీటి సరఫరా పైపులైను లీకేజీలు, వీధి దీపాలు, అక్రమ నిర్మాణాలు తదితర సమస్యలను డివిజన్‌లో ఎక్కడున్నా వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఆర్ఐ శంకర్ రావు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి



శ్రీపాద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు

మంథని, ఏప్రిల్ 13: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి శనివారం నిర్వహించారు. మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, రామగుండం, చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, గడ్డం వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీపాదరావు ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15న ఉచిత కంటి ఆపరేషన్లు

పెద్దపల్లి, ఏప్రిల్13:లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో ఈనెల 15న కరీంనగర్‌లోని రేకుర్తి కంటి దవాఖానలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పూదరి దత్తాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 ఏండ్లు పై బడి కళ్ళు కనిపించని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఉచిత రవాణా భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఐసీహెచ్ చైర్మన్‌కు డాక్టరేట్

జ్యోతినగర్, ఏప్రిల్ 13: ప్రముఖ ఇండియన్ కాఫీ వర్కర్స్ కో ఆపరేటీవ్ సోసైటీ ఆధ్వర్యంలోని ఇండియన్ కాఫీ హౌజ్ (ఐసీహెచ్) సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఒ.కె రాజగోపాలన్‌కు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ లభించింది. ప్రముఖ అంతర్జాతీయ యూనివర్సిటీ ఐన్‌స్టీన్ ఇటీవల డాక్టరేట్ పట్టాను అందజేసింది. రామగుండం ఎన్టీపీసీలో ఇండస్ట్రియల్ క్యాంటిన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఎన్టీపీసీ ప్రాజెక్టుల్లో ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల్లో ఐసీహెచ్ ఇండస్ట్రియల్ క్యాంటీన్‌లను నిర్వహిస్తుంది. వ్యాపార రంగంలో నైతికత విలువలు, సమర్థత, ఉద్యోగుల సంక్షేమంపై తీసుకుంటున్న చర్యలకు గాను ఐన్‌స్టీన్ యూనివర్సిటీ రాజగోపాలన్‌కు డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా రామగుండం ఎన్టీపీసీ ఐసీహెచ్ సీనియర్ మేనేజర్ ఎంఐ బెన్ని, మేనేజర్లు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఇనుప తుక్కు చోరీ

ముత్తారం, ఏప్రిల్ 13: మండలంలోని ఓడేడు బ్రిడ్జి వద్ద ఇనుప స్క్రాప్ చోరీకి గురైనట్లు ముత్తారం ఎస్ఐ ఎ. మధుసూదన్ రావు తెలిపారు. ఓడేడు మానేరుపై నిర్మాణంలో ఉన్న బిడ్జీ వద్ద 10 ఇనుప సెంట్రింగ్ ప్లేట్స్, రెండు స్టేజింగ్ క్రిబ్స్ గుర్తు తెలియని దొంగలు అపహరించారని, బ్రిడ్జి సైట్ ఇన్చార్జి సయ్యద్ బాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నియామకం

జూలపల్లి, ఏప్రిల్ 13 ః పద్మశాలీ సంఘం తెలంగాణ ప్రాంత కార్యవర్గ సభ్యుడుగా తేలుకుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల రాజమౌళి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు కమార్తకు మురళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రం కలిసి రాజమౌళికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి తనకు బాధ్యతలు అప్పగించిన సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

- ఎన్నికల విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి
- రామగుండం సీపీ శ్రీనివాస్

మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 13: ఈ నెల 17న తమిళనాడులో జరిగే సాధారణ ఎన్నికల విధులకు వెళ్తున్న హోంగార్డులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎన్నికల విధుల్లో బాధ్యతగా వ్యవహరిం చాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. తమిళనాడు ఎన్నికల విధులకు వెళ్తున్న 64మంది హోంగార్డులతో సీపీ శనివారం సమా వేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అప్పగించిన విధులను నిబద్ధతతో పూర్తి చేసి తెలంగాణ పోలీసు, రామగుండం కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు. విధుల్లో ఉండగా స్థానికంగా ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే ఇక్కడి అధికారులకు సమాచారం అందిస్తే స్పందించనున్నట్లు తెలిపారు. పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని సీపీ భరోసా ఇచ్చారు. ఇక్కడ అడిషనల్ అడ్మిన్ డీసీపీ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐ హోంగార్డ్స్ మల్లేశం ఆర్ఎస్ఐ తదితరులు ఉన్నారు.

కృష్ణవేణిలో గ్రాడ్యుయేషన్, స్పోర్ట్ అండ్ కల్చర్ మీట్

గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు, ఉపాధ్యాయులు

మంథని, ఏప్రిల్ 13: స్థానిక కృష్ణవేణి హై స్కూల్‌లో శనివారం గ్రాడ్యూవేషన్, స్పోర్ట్ అండ్ కల్చర్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. కిండర్ గార్టెన్ విద్యార్థులకు కాన్వోకేషన్ పట్టాలు అందజేసి అభినందించారు. అలాగే పలు ఆటల పోటీల్లో గెలు పొందిన వారికి ఐఐటి, నీట్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై అభ్యంతరం

ధర్మారం,ఏప్రిల్13: నర్సింగాపూర్ లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంపై ఆ గ్రామ స్వశక్తి సంఘాల మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. డీఆర్ఆర్‌డీవో ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామంలో సెర్ప్‌కు అనుబంధం గా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆగ్రామ వీవో అధ్యక్షురాలు ప్రారంభించారు. సమాచారం తెలుసుకున్న కొందరు స్వశక్తి సంఘాల మహిళలు కేంద్రం వద్దకు వెళ్లి సెంటర్ నిర్వహకులకు వారు తమ అభ్యంతరాలను తెలిపారు.గతంలో ఇది వర కు ఐకేపీ కేంద్రం నిర్వ హించగా అవతకలు జరిగాయని ఈ క్రమంలో కొనుగోలు కేంద్రం బంద్ కాగా మళ్లీ ఇప్పుడు ఎందుకు నిర్వహిస్తున్నారని మహిళలు ప్రశ్నించారు.2013 నుంచి వీవోకు సంబంధించిన లెక్కలు తేలిన తర్వాతే కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించాలన్నారు. అప్పటి దాకా కొనుగోళ్లు చేయవద్దని ఆక్షేపించారు. దీంతో కేంద్రం నిర్వహణపై సందిగ్ధం ఏర్పడింది.దీనిపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి వివాదానికి తెరదించాల్సి ఉంది.

సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

ఆపిల్ కిడ్స్‌లో వార్షికోత్సవం

కమాన్‌పూర్, ఏప్రిల్ 13ః మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో 10వ వార్షికోత్సవం సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఉపాధ్యాయ బృందంను టంగుటూరు రాజయ్య, విజయానంద్ అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్బ కేశవరెడ్డి, ఓదెలు యాదవ్, కరుణాకర్ రావు, ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మి, సుమలత, శారద, గౌతమి, పద్మ ఉన్నారు.

అటవీ ప్రాంతంలో మంటలు

ముత్తారం, ఏప్రిల్ 13: అడవి శ్రీరాంపూర్ అటవీ ప్రాంతంలో శనివారం మంటలు చెలరేగాయి. అటవీ శాఖ సెక్షన్ అధికారి నర్సయ్య తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరు కొని మంటలను నియంత్రించారు. నర్సయ్య మంటలు ఎలా అంటు కున్నాయో తెలియ దని, దర్యాప్తు చేస్తున్నట్లు నర్సయ్య తెలిపారు.

తెలంగాణ ప్రాజెక్టు యూనిట్-1లైటప్

జ్యోతినగర్, ఏప్రిల్ 13: ఎన్టీపీసీలోని 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని 800మెగావాట్ల ఒకటో యూనిట్‌ను అధికారులు లైటప్ చేశారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా 12 రోజుల క్రితం ఉత్పత్తిని నిలిపివేశారు. సాయంత్రం మరమ్మతులు పూర్తి చేసి, యూనిట్‌ను ఉత్పత్తి దశలోకి తెచ్చారు. రాత్రి 7.22 గంటలకు లోడ్ వేయగా ఉత్పత్తి ప్రారంభమైంది.

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై స్పందన

గోదావరిఖని, ఏప్రిల్ 13ః సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పట్ల యాజమాన్యం, గుర్తింపు సంఘం స్పందించింది. ఈమేరకు ఘట్‌కేసర్ మండలం కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల మాట మంతి జరిగింది. సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సీపీఆర్ ఎంఎస్ ట్రస్టు సమావేశంలో జీఎం వెల్ఫేర్ బసవయ్య, ఇతర అధికారులు, ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్న అంశాలపై చర్చ జరిపారు. రిటైర్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై గుర్తింపు సంఘం, యాజమాన్యంతో చర్చించడం శుభ పరిణామమని ప్రతి మూడు నెలలకు ఒకసారి సీపీఆర్ఎంఎస్ ట్రస్టు సమావేశం నిర్వహిస్తామని యాజమాన్యం తెలిపిందని సింగరేణి రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ తెలిపారు. రిటైర్డు కార్మికులు క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, పక్షవాతం లాంటి క్రిటికల్ జబ్బుల వైద్యం కొరకు వారి మెడికల్ కార్డు ఉన్న రూ.8 లక్షల నగదు ముగిసిన తర్వాతనే అపరిమిత వైద్యం పొందేవారు. ఇక నుంచి క్రిటికల్ వైద్యం కొరకు యాజమాన్యమే భరిస్తుందని గతంలో విశ్రాంత ఉద్యోగుల మెడికల్ కార్డులో ఉన్న 8లక్షల నుంచి ఖర్చు అయిన వారి అకౌంట్‌లో తిరిగి జమ చేసేందుకు అంగీకారం తెలిపిందని, హైదరాబాద్‌లో నివసిస్తున్న ఉద్యోగులు ప్రతి నెల మందులు వారు పని దిగిపోయిన చోటనే సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో ఇవ్వడం వల్ల ప్రయాసతో కూడుకున్న వ్యవహారం అని ఇకపై హైదరాబాద్ నగరంలోని విశ్రాంత ఉద్యోగులకు నెలవారి మందులు పంపిణీ పట్ల యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో ఎంత సొమ్ము బ్యాలన్స్ ఉందో మొబైల్ నంబర్‌కు మెసేజ్ ద్వారా తెలియజేసేందుకు ఒప్పందం జరిగింది. ఇందుకు కృషి చేసిన ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అల్ఫోర్స్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గ్రాడ్యుయేషన్ డేలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, విద్యార్థులు

సుల్తానాబాద్ ఏప్రిల్ 13: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆల్ఫోర్స్ పాఠశాలలో పునాదులు వేస్తున్నామని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో కార్డియల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య దశ జీవితంలో మధుర జ్ఞాపకాలను నెమరువేస్తుందన్నారు.పాఠశాలలో యూకేజీ పూర్తిచేసుకుని ప్రైమరీ స్కూల్ లోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు పట్టాలను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని పట్టాలు స్వీకరించి ఉన్నత స్థానంలో నిలవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- తలకు తీవ్ర గాయాలు కావడంతో డ్రైవర్ మృతి
- ఎర్రగుంటపల్లిలో శివారులో ఘటన

మహేశ్(ఫైల్)

ధర్మారం,ఏప్రిల్13: వాహనాన్ని నడుపుతున్న క్రమంలో నిద్రమత్తులోకి జారడంతో ఓ నిండు ప్రాణం పోయింది. మృతుడి కుటుంబంలో విషాదం నింపింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దోనూరు గ్రామానికి చెందిన పందిరి మహేశ్(35) అతని భార్య పూజితతో కలిసి కారులో కరీంనగర్‌కు బయల్దేరారు. మార్గం మధ్యలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామ శివారులోకి రాగానే మహేశ్ అకస్మాత్తుగా నిద్ర మత్తులోకి వెళ్లాడు. తో కారు అకస్మాత్తుగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభానికి ఢీకొట్టడంతో